క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన యువనేతలు



జగన్‌తో వైఎస్సార్ సీపీ యువ నేతలు

మండపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా కన్వీనర్ చోడే సత్యకృష్ణ, మండపేట నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్ శ్రీకృష్ణ కలిశారు. యువజన విభాగం కన్వీనర్‌గా తనకు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల శ్రీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



అంగరలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 25 మంది గర్భిణులను పరీక్షించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఇద్దరిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన వైద్య పరీక్షలకు నివేదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోషక విలువలున్న ఆహారంపై ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు తదితరులు అవగాహన కల్పించారు. శిబిరంలో వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

నలుగురి అరెస్ట్



కోడిపందేల నిందితులతో గొల్లపాలెం పోలీసులు

కాజులూరు: పెనుమళ్లలోని కోడిపందేల స్థావరాలపై మంగళవారం దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. దాడులలో స్టేషన్ హెచ్‌సీలు శేషు, వీరబాబు, సిబ్బంది శేఖర్, మూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో నేడు పూజలు

రాయవరం: స్థానిక వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవానీ శంకర అష్ట లింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ చేసి లలితా అష్టోత్తర, సహస్ర నామాలు, లక్ష్మీ, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో మహిళలచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు జరుగుతాయన్నారు.

పౌర్ణమి స్నానాలకు ఏర్పాట్ల పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను రెవెన్యూ, పోలీసు, దేవస్థానం అధికారులు మంగళవారం పరిశీలించారు. సముద్ర స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు, బీచ్‌లో జల్లు స్నానం ఏర్పాట్లను పర్యవేక్షణాధికారి, రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. జల్లు స్నానం క్యూ గురించి ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఆర్డీవోకు వివరించారు. అలాగే స్నానం అనంతరం స్వామివారు సేదతీరే వసంత మండపం, ఆలయం వద్ద తెప్పోత్సవానికి ఏర్పాటు చేస్తున్న చెరువు పనులను ఆర్డీవో అఖిల పరిశీలించారు. కాగా ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజల స్థలాన్ని, స్వామిని సముద్రం స్నానానికి తీసుకువెళ్లే మార్గం గురించి కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణతో సమీక్షించారు. అలాగే ఒడ్డున భక్తులకు గతంలో మాదిరిగా జల్లు స్నానం ఏర్పాట్లను వారు పరిశీలించారు. వీటితో పాటు సముద్రంలో స్వామితో పాటు స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా చూడాలని అన్నారు.

జేబు దొంగలున్నారు జాగ్రత్త!

- మండపేట బస్టాండ్‌లో పరిస్థితి
- ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం

మండపేట: పేరుకే పట్టణం.. సమస్యలతో సతమతం తప్పడం లేదు. ప్రధానంగా మండపేటలో బస్టాండ్ ఉన్నమాటే అధికారులు మరిచారు. దానిని పట్టించుకునే నాథుడే లేక అస్తవ్యస్తంగా తయారైంది. జేబు దొంగలకు నిలయంగా మారింది. తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. నియోజకవర్గానికి కేంద్ర బిందువుగా ఉన్న మండపేటలో ఒకే ఒక బస్టాండ్ ఉంది. చుట్టుపక్కల 40 నలభై గ్రామాల ప్రజలకు ఇదొక్కటే ఆధారం. నిత్యం వందలాది మంది ఈ బస్టాండ్‌ను ఆశ్రయిస్తారు. ఇక్కడి నుంచే బస్సుల్లో వారి గమ్యస్థానాలకు వెళ్తుంటారు. ఇటు విజయవాడ, అటు విశాఖపట్నంతో పాటు కర్ణాటక వెళ్లేందుకు కూడా గంగావతి, హైదరాబాద్ బస్సుల కోసం ఇక్కడికి రావాల్సిందే. పగలు విపరీతమైన రద్దీ ఉంటుంది. అర్ధరాత్రయినా కూడా ఈ బస్టాండ్ వద్ద పదుల సంఖ్యలో ప్రయాణికులు నిరీక్షిస్తుంటారు. ఒక విధంగా చెప్పాలంటే ఆర్టీసీ డిపోకు ఇదొక ప్రధాన ఆదాయ వనరు. రూ.లక్షల్లో ఆదాయం చేకూరుతుంది. ఇంత ప్రాధాన్యం కలిగిన బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మండపేటలో ఆర్టీసీ బస్టాండ్

సందట్లో సడేమియా

ఇక్కడ నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయి. పిల్లా పాపలతో ఏదైనా దూరప్రాంతం వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చిన సమయంలో వారి హడావుడిలో ఉండడాన్ని చూసి జేబు దొంగలు పర్సులు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను దొంగిలించుకు పోతున్నారు. తమ గోడు ఎవరికైనా చెప్పాలన్నా స్టాండ్‌లో సమాధానం చెప్పే దిక్కు లేకుండా పోయిందని ప్రయాణికులు అంటున్నారు. గతంలో అప్పుడప్పుడు అనౌన్స్‌మెంట్ చెప్పేవారని, ఇప్పుడు ఆ సౌకర్యం కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల రాకపోకలు, వాటి సమయపాలన తెలియక నానా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. బస్టాండ్ వద్దకు వచ్చే సరికి నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. సందట్లో సడేమియా అన్నట్లు జేబు దొంగలు తమ పని చక్కబెట్టుకుని పోతున్నారు. వారం కిందట పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ ఒకరు డ్యూటీ ఎక్కేందుకు తెల్లవారు జామున బస్టాండ్‌కు వస్తే బస్ ఎక్కే సమయంలో కండక్టర్ చేతిలో వున్న సెల్‌ఫోన్ తీసుకుని దుండగుడు ఉడాయించాడు. ఆ కండక్టర్ లబోదిబోమన్నా ఫలితం లేకపోయింది. దానికితోడు బస్టాండులో సీసీ కెమెరాలు మరుగున పడ్డాయి. గతంలో లయన్స్ సౌజన్యంతో బస్టాండ్ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాని మెయింటెనెన్స్ లేక బూజు పట్టి మూలకు చేరాయి. దీనిపై పోలీసులు దృష్టి సారించి దొంగతనాలు అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాత్రయితే అంధకారం

బస్టాండ్‌లో రాత్రయితే కనీసం దీపం వెలిగించే దిక్కులేకుండా పోయిందని ప్రయాణికులు అంటున్నారు. దీని ఆలనాపాలనా ఎవరి బాధ్యత అని కొందరు ప్రశ్నించగా రామచంద్రపురం డిపో వారు రావులపాలెం డిపోదని, రావులపాలెం డిపో వారు రామచంద్రపురం డిపోదని చెబుతున్నారని పలువురు అంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బిక్కిన కృష్ణార్జున చౌదరి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఏడిద రోడ్డులో దీనికి అనుసంధానంగా రెండో బస్టాండ్‌ను నిర్మించారు. కొన్నాళ్లు మాత్రమే వినియోగంలో ఏంది. ఆ బస్టాండ్ వైపు ప్రయాణికులు అంతగా ఆసక్తి చూపించకపోవడం, బస్టాండ్‌కు కూడా బస్సులు అంతగా రాకపోవడం, దానికి పెద్దగా ప్రచారం లేకపోవడం వంటి కారణాలతో కాలగర్భంలో కలిసిపోయింది. ఏడిద రోడ్డు బస్టాండ్ మరుగన పడడంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాలకులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించి తమ ఇక్కట్లు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలి



ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసి రైతుకు అందజేస్తున్న ఏఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో మండల వ్యవసాయాధికారి(ఏవో) ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ–పంట నమోదు, ఈ–కేవైసీలు పూర్తి చేసుకోవాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో సొంత భూమి కలిగిన ప్రతి రైతు పేరు, వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. 11 నంబర్ల గుర్తింపు సంఖ్యలను రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులవుతారని వివరించారు. దీని కోసం ఆధార్ కార్డు, రైతు పొలం పాస్ పుస్తకం, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ తీసుకుని భూమి కలిగి ఉన్న రైతు సేవా కేంద్రంలో సంప్రదిస్తే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

భీమేశ్వరస్వామి రథోత్సవంలో ఆస్థాన పూజ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవం వేగాయమ్మపేటకు చేరుకున్న సందర్భంగా సాయంత్రం వేగాయమ్మపేటలో ఆస్థాన మండపం వద్ద ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో వాడ్రేవు జమీందార్ల వంశస్తుడు రాజా వాడ్రేవు సుందర రత్నాకరరావు చేతుల మీదుగా ఆస్థాన పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పంతో ఆస్థాన పూజ ముగిసింది. ఆలయ అర్చకులు, వేదస్వస్తి వాచకులు, ఆలయ సిబ్బంది



వేగాయమ్మపేటలో ఆస్థాన పూజ నిర్వహిస్తున్న ఈఓ వెంకట దుర్గాభవాని, జమీందారు సుందర రత్నాకరరావు తదితరులు

పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం అందజేశారు. రాత్రి రథం వద్ద సంగీత కచేరి నిర్వహించారు. రథోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం డీఎస్పీ జి.రఘువీర్, సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, పామర్రు ఎస్సై జానీబాషా, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి విద్యుత్ వైర్లను తొలగించారు. రథోత్సవం ముగిసిన తరువాత తిరిగి పునరుద్ధరించారు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణల నేతృత్వంలో రథం తిరిగే వీధులను పరిశుభ్రం చేయించి సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ మృత్యుంజయరావుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు



రామచంద్రపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు, వీఆర్వోలు

కె.గంగవరం: గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)ల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ మృత్యుంజయరావుకు మంగళవారం మండల గ్రామ రెవెన్యూ సంఘం సభ్యులు వినతి పత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరులుగా విభజించడం శాస్త్రీయమైన ఆలోచనని ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామ రెవెన్యూ అధికారులందరికీ గ్రేడులను తొలగించాలని, అందరికి డీడీఓగా తహసీల్దార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సచివాలయ రేషనలైజేషన్‌లో రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని వారు కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వీరయ్య, అధ్యక్షుడు వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితర గ్రామ రెవెన్యూ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీఆర్వోల గ్రేడులు తొలగించాలని వినతి

రామచంద్రపురం రూరల్: వీఆర్వోల్లో గ్రేడులను తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రామచంద్రపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఎం.సావిత్రికి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులకు డీడీఓలుగా పంచాయతీ కార్యదర్శులు ఉండటం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీఆర్వోల్లో గ్రేడులు తొలగించి డీడీఓలుగా తహసీల్దార్లను నియమించేలా ప్రభుత్వాని నివేదిక పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వాసంశెట్టి సత్యప్రసాద్, సంఘ మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షుడు నరహరిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేయాలి

ఆర్డీఓ అఖిల

కోటిపల్లి (కె.గంగవరం): మహాశివరాత్రి ఉత్సవాల్లో తమకు అప్పగించిన పనిని బాధ్యతగా విధులు నిర్వహించి సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం ఆర్డీఓ అఖిల అన్నారు. మండలంలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 26న జరగబోయే మహాశివరాత్రిలో భక్తుల కోసం ప్రభుత్వం తరఫున అధికారులు చేసే ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. తొలుత ఆమె శాఖల వారీగా ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర అధికారులు భక్తుల కోసం చేసే ఏర్పాట్లను ఆర్డీఓకు వివరించారు. ఆమె మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రి రోజున జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కోటిపల్లి గ్రామానికి తరలివస్తారని పూర్తి స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు రాజమహేంద్రవరం,



శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీఓ అఖిల

కాకినాడ, రావులపాలెం, రామచంద్రపురం, యానం తదితర ప్రాంతాల నుంచి కోటిపల్లి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహాశివరాత్రి రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పై అధికారులు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. డీఎస్పీ రఘువీర్, ఎంపీపీ పంపన నాగమణి. సర్పంచ్ పెమ్మాడి బేబి, దేవదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీరాంప్రసాద్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ పప్పుల మసేను వెంకన్న, ఆలయ ఈఓ భీమశంకరం, మండల స్థాయి అధికారులు, స్థానిక పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట: నియోజకవర్గంలోని చిల్లర వర్తకులు, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ తరఫున కృషి చేస్తానని ఆ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పలుకూరి వెంకన్నబాబు అన్నారు. కేశవరం గ్రామానికి చెందిన పలుకూరి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో వాణిజ్య విభాగం అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఆయనకు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, నాయకుడు గారపాటి అశోక్ అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్సీ త్రిమూర్తులుతో పలుకూరి వెంకన్నబాబు

జాతీయ క్రీడా పోటీలకు ఎంపిక



వెంకట్రాజును అభినందిస్తున్న సహోద్యోగులు

మండపేట: ఏడిద జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న పట్టణానికి చెందిన ముంగర వెంకట్రాజు జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందారు. అనంతపూర్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మాస్టర్ అథ్లెటిక్స్ ఏపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. 55 ప్లస్ విభాగంలో 100, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారు. మంగళవారం ఏడిద పాఠశాల ఆవరణలో తోటి ఉపాధ్యాయులంతా ఆయన్ని సత్కరించారు. జాతీయ క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. డీఈఓ షేక్ సలీం బాషా, రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.లక్ష్మణమూర్తి ప్రశంసించారు. ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి, కోనసీమ జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు మోకా ప్రకాష్, కార్యదర్శి విత్తనాల శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి తాడి వీర రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.రాజు, విత్తనాల శ్రీనివాస్ అభినందించిన వారిలో ఉన్నారు.

న్యాయపర సమస్యలు పరిష్కరిస్తా..



లీగల్ సెల్ ఛైర్మన్ గోవిందరావు

మండపేట: నియోజకవర్గంలో బాధితుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఛైర్మన్‌గా నియమితులైన టీవీ గోవిందరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మూడో పర్యాయం తనను లీగల్ సెల్ ఛైర్మన్‌గా ఎంపిక చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట రూరల్ అర్బన్ ప్రాంతాల్లోని కూటమి నేతల కారణంగా ఇబ్బందిపడిన బాధితులు మండపేట ప్రధాన కార్యాలయానికి వస్తే కేసులు పరిష్కరించడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకూ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్రంలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయని గోవిందరావు అన్నారు. అయితే మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లేదన్నారు. దీనిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ద్వారా రాష్ట్ర న్యాయ శాఖామంత్రి ఎన్ఎండీ ఫారుక్‌కు త్వరలో ఒక వినతి పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయం సహాయక సంఘాలకు రేషన్ దుకాణాలు కేటాయించారని, వాటిని తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాలు లీగల్ సెల్ తిప్పి కొట్టిందన్నారు. నేడు జిల్లాలో కొత్త రేషన్ డీలర్ల నియామకానికి ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా, వాటిపై హైకోర్టు స్టే విధించిందన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మండపేట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పరిసరాల శుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. 15వ వార్డు ధర్మగుండం చెరువు, వృద్ధాశ్రమం తదితర ప్రాంతాల్లో మెప్మా సిబ్బందితో మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరూ ఇంటి శుభ్రతతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆర్పీలు తడి, పొడి చెత్తను వేరు చేసే విధానం వివరించారు. పొడి చెత్తను డస్ట్ బిన్ల ద్వారా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. మిగిలిన తడి చెత్తను ఇంటి వద్దే హోం కంపోస్టు తయారీకి వినియోగించాలని చెప్పారు. టెర్రస్, గార్డెన్, కిచెన్ గార్డెన్‌లకు ప్రాధాన్యతనిచ్చి ఆర్గానిక్ కూరగాయలు పండించుకోవాలన్నారు. డ్రైనేజీల్లో చెత్త వేస్తే దోమలు వ్యాప్తి చెందుతాయని, తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కమిషనర్ రంగారావు మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలన్నారు. మార్కెట్‌కు వివిధ వస్తువులు కొనుగోలు నిమిత్తం వచ్చే వారంతా క్లాత్ బ్యాగ్స్ వెంట తెచ్చుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ధర్మగుండం కాలనీలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్, మెప్మా సిబ్బంది

ఉద్యాన సాగు ప్రాధాన్యం గుర్తించండి



కేదారిలంకలో శిక్షణ పొందిన విద్యార్థులతో సర్పంచ్, ఎంపీటీసీ

కపిలేశ్వరపురం: ఉద్యాన పంటల సాగు ప్రాధాన్యాన్ని గుర్తించాలని కేదార్లంక సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు పోలిశెట్టి గణేష్, రంకిరెడ్డి వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యాన సాగు పద్ధతులపై శిక్షణ పొందిన వ్యవసాయ విద్యార్థులను స్థానికంగా మంగళవారం సత్కరించారు. డాక్టర్ వైఎస్సార్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని తాడేపల్లిగూడెం కళాశాలకు చెందిన విద్యార్థులు నాలుగు నెలలుగా క్షేత్ర స్థాయిలో ఉద్యాన పంటల సాగు పద్ధతుల అధ్యయనంలో భాగంగా కేదారిలంకలో పర్యటిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సత్కార సభ నిర్వహించారు. శిక్షణకు తోడ్పడిన అంబాజీపేట వైఎస్సార్ యూనివర్సిటీ కొబ్బరి పరిశోధన శాస్త్రవేత్తలు నీరజ, కోటేశ్వరరావు, విశ్వనాథ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వీధి ప్రసాద్, సాదా రవిభాస్కరరావు, వీధి గంగాధర్, సాదా ధనరాజ్, మారిశెట్టి చంటి, యర్రంశెట్టి కామరాజు, రైతులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మండపేట: ఏడిద సీతానగరంలో సత్తెమ్మతల్లి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామంలోని కసిరెడ్డివారి ఇంట వేపచెట్టు కింద సత్తెమ్మ తల్లి వెలిసి గ్రామస్తులచే పూజలందుకుంటోంది. పుష్కరకాలంగా అమ్మవారు గ్రామదేవతగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు. గ్రామ, చుట్టు పక్కల ప్రజలు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. సర్పంచ్ వరదా చక్రవర్తి దంపతులు సత్తెమ్మను దర్శించుకున్నారు. కసిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కసిరెడ్డి పెద్దవెర్రియ్య, మేడిద గణపతి తదితరులు పాల్గొన్నారు.